క్లుప్తంగా

కాంట్రాక్టు ఉద్యోగులకు నియామక ఉత్తర్వులు



గుంటూరు మెడికల్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం పరిధిలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులకు శనివారం కౌన్సెలింగ్ నిర్వహించి రెగ్యులర్ చేస్తూ డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి నియామక పత్రాలు అందజేశారు. కాంట్రాక్టు ఉద్యోగుల్ని రెగ్యులర్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం రెండు రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఎంపీహెచ్ఏ మేల్ 87 మంది, ఎంపీహెచ్ఏ ఫిమేల్ 54 మంది, ల్యాబ్ టెక్నీషియన్లు ఆరుగురు రెగ్యులర్ ఉద్యోగులుగా ఉత్తర్వులు అందుకున్నారు. ఫార్మాసిస్టులు 15 మంది సర్టిఫికెట్లు పరిశీలించి గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకుల కార్యాలయం (ఆర్డీ) కార్యాలయానికి నియామకపు ఉత్తర్వులు అందజేసేందుకు పంపారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో డీఎంహెచ్ఓతోపాటు ఆఫీస్ సూపరింటెండెంట్ సత్యం, స్టెనోగ్రాఫర్ సురేష్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వీణ నాదార్చన



పాత గుంటూరు: బ్రాడీపేటలోని ఓంకార క్షేత్రంలో మహా శివరాత్రి పురస్కరించుకొని శుక్రవారం నుంచి 24 గంటల పాటు నిర్విరామంగా సాగిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తుల్ని విశేషంగా ఆకట్టుకున్నాయి. శ్రీ భారతి సంగీత నిలయం వ్యవస్థాపకులు భారతీదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన వీణ నాదార్చనలో కె. నాగలక్ష్మి, సాయిలక్ష్మి పలు కీర్తనల్ని వీణలపై వీనుల విందుగా పలికించి ఆహూతుల్ని అలరించారు. వీరికి మృదంగంపై జగన్మోహిని వాయిద్య సహకారాన్ని అందించారు.

సాయుధ బలగాలతో కవాతు

పట్నంబజారు: నగరంలోని లాలాపేట పోలీసు స్టేషన్ పరిధిలో శనివారం సాయుధ బలగాలతో కలసి పోలీసులు కవాతు నిర్వహించారు. స్టేషన్ ఎస్ఐ సుబ్బారావు ఆధ్వర్యంలో లాంచస్టర్ రోడ్డు, ఎల్ఆర్ కాలనీ, ఐపీడీకాలనీ తదితర ప్రాంతాల్లో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రజలకు ధైర్యం కల్పించే విధంగా ఫుట్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సిద్ధం సభను జయప్రదం చేయాలి

సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా



సిద్ధం పోస్టర్లు, టీషర్టులు ఆవిష్కరిస్తున్న నూరిఫాతిమా తదితరులు

పట్నంబజారు: నేడు మేదరమెట్లలో జరగనున్న సిద్ధం సభను జయప్రదం చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా పిలుపునిచ్చారు. 57వ డివిజన్‌లోని అంబేడ్కర్ నగర్‌లో ఉన్న కృష్ణ బలిజ సంఘం ఎడ్యుకేషన్ సొసైటీ కమ్యూనిటీ హాలులో శనివారం కృష్ణ బలిజ, పూసల కార్పొరేషన్ చైర్మన్ కోలా భవాని ఆధ్వర్యంలో సంఘీయుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముందుగా సిద్ధం సభకు సంబంధించిన టీ షర్ట్‌లు, పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నూరిఫాతిమా మాట్లాడుతూ కృష్ణ బలిజ సంఘీయులందరూ ఏకతాటిపై వచ్చి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల కోసమే వైఎస్సార్‌సీపీ ఆవిర్భవించిందని తెలిపారు. ఆదివారం జరగనున్న సిద్ధం సభకు తూర్పు నియోజకవర్గం నుంచి పెద్దఎత్తున తరలిరావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్పొరేషన్ చైర్మన్ కోలా భవాని మాట్లాడుతూ చిన్న కులాలకు సైతం గౌరవాన్ని కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి రుణ పడి ఉంటామన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పని చేయాలని తెలిపారు. కార్యక్రమంలో 57వ డివిజన్ కార్పొరేటర్ పఠాన్ రిహానా, పార్టీ డివిజన్ అధ్యక్షుడు నూర్‌ఖాన్, కృష్ణ బలిజ సంఘం నేతలు వీసం శ్రీను, బత్తుల శంకరరావు, వాసు, వెంకటరెడ్డి, మేరి, లెనిన్, బాజీ, సాగర్, శ్రీనివాసులురెడ్డి, సురేంద్ర పాల్గొన్నారు.

రేపు ఇస్లామిక్ కౌన్సిలింగ్ సెంటర్ నిర్మాణానికి ప్రారంభోత్సవం




ఎమ్మెల్యే రోశయ్యకు ఆహ్వాన పత్రం అందజేస్తున్న ముస్లిం మత పెద్దలు, షాదిఖానా కమిటీ సభ్యులు

పట్నంబజారు: పట్టాభిపురంలో ఈనెల 11న మౌలానా అబుల్‌కలాం అజాద్ షాదిఖానా వెనుక ఉన్న ఇస్లామిక్ కౌన్సిలింగ్ సెంటర్ భవన నిర్మాణ ప్రారంభోత్సవానికి హాజరు కావాలని పొన్నూరు ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త కిలారి రోశయ్యను షాదీఖానా కమిటీ సభ్యులు, ముస్లిం మతపెద్దలు ఆహ్వానించారు. కృష్ణనగర్‌లోని ఆయన నివాసంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోశయ్య మాట్లాడుతూ ముస్లింలు వైఎస్సార్ సీపీకి పట్టుగొమ్మలని చెప్పారు.

దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి, రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మైనార్టీలకు అన్ని రంగాల్లో పెద్దపీట వేశారని తెలిపారు. ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత మహానేత వైఎస్సార్‌కే దక్కుతోందని చెప్పారు. రానున్న ఎన్నికల్లో ముస్లింలు వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, షాదిఖానా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



పబ్లిక్ పరీక్షల్లో ఆందోళన వద్దు

పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు



విద్యార్థినికి హాల్ టికెట్ అందజేస్తున్న శ్రీధర్‌బాబు

గుంటూరు ఎడ్యుకేషన్: పబ్లిక్ పరీక్షల పేరుతో అర్థం లేని ఆందోళన వద్దని పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు సూచించారు. ఎన్జీవో కాలనీలోని సుమేధ హైస్కూల్లో 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరు కానున్న విద్యార్థులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీధర్‌బాబు మాట్లాడుతూ పదో తరగతి అనేది పాఠశాల విద్యార్థి దశలో చివరి దశ అన్నారు. దాన్ని విజయవంతంగా పూర్తి చేసి, ఇంటర్మీడియెట్ దశలోకి అడుగు పెట్టేందుకు సిద్ధం కావాలని సూచించారు. పాఠశాల విద్యార్థిగా గడిపిన రోజులు జీవితాంతం గుర్తుండిపోతాయని, పదో తరగతి పరీక్షలు రాసిన తరువాతే ఇచ్చే సర్టిఫికెట్ జీవితంలో ఎంతో ముఖ్యమైనదని తెలిపారు. ప్రతి క్రికెటర్ తన చివరి ఓవర్‌లో శక్తినంతటినీ కూడగట్టుకుని ఏ విధంగా పరుగులు సాధిస్తారో, టెన్త్ విద్యార్థులు సైతం ఏడు పరీక్షల్ని అంతే సమర్థంగా ఎదుర్కోవాలని చెప్పారు. ఏడాది పొడవునా విద్యార్థులు చదివిన పాఠ్యాంశాలే ప్రశ్న పత్రంలో వస్తాయని, సక్రమమైన ఆలోచనలు, మానసిక ప్రశాంతతో పరీక్షలకు హాజరుకావాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు హాల్ టికెట్లు, ప్యాడ్, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖరరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు రాంబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో ఉద్యోగినులకు సన్మానం



డాక్టర్ శైలజను అభినందిస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: రాయల్, క్యాప్స్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం గుంటూరు జీజీహెచ్‌లో పనిచేస్తున్న ఉద్యోగినులను సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ నేడు మహిళలు పురుషులతో పాటు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో రాయల్, క్యాప్స్ సంస్థల అధినేతలు బాలాజీ, దేవినాయుడు పాల్గొన్నారు.

హెచ్ఐవీ చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ

జీజీహెచ్‌లోని శుశ్రుత హాలులో శనివారం హెచ్ఐవీతో బాధపడుతున్న చిన్నారులకు సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ పౌష్టికాహారం పంపిణీ చేశారు. అమ్మ ట్రస్టు, మానవతా సేవాసమితికి చెందిన ప్రశాంతికుమారి మాట్లాడుతూ చిన్నారులకు డ్రైఫ్రూట్స్, భోజన సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థినికి ఏఆర్టీ సెంటర్ డాక్టర్ రవిశంకర్ రూ.3వేలు ఆర్థిక సాయం చేశారు. చర్మవ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు డాక్టర్ కిరణ్‌కుమార్ సబ్బులు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సరోజిని, ముస్తఫా, వర్మ పాల్గొన్నారు.